క్లుప్తంగా

గరికపాడు చెక్‌పోస్ట్ పరిశీలన



గరికపాడు(జగ్గయ్యపేట): ఏపీ–తెలంగాణ సరిహద్దు గల గరికపాడు చెక్‌పోస్ట్‌ను రాష్ట్ర ఎన్నికల అబ్జర్వర్ శ్రీరాం మోహన్ మిశ్రా శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగదు, మద్యం అక్రమ రవాణా సాగకుండా చెక్‌పోస్టు వద్ద ప్రతి వాహనాన్ని తనిఖీ చేయాలని సూచించారు. ముఖ్యంగా పోలీస్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆయన ఆదేశించారు. ఆయన వెంట జగ్గయ్యపేట ఎన్నికల రిటర్నింగ్ అధికారి జి.వెంకటేశ్వర్లు, నందిగామ ఏసిపి రవికిరణ్ ఉన్నారు.

చిన్నారి వైద్యానికి దీవెన ఫౌండేషన్ ఆర్థిక సాయం



భవానీపురం(విజయవాడపశ్చిమ):సంవత్సరం వయసుగల అబ్దుల్ సఫియా బ్లడ్ క్యాన్సర్‌తో బాధపడుతుంది. పటమట సనత్‌నగర్‌కు చెందిన ఇమ్రాన్ చిరు ఉద్యోగం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. చిన్నారి సఫియా హాస్పటల్‌లో చికిత్స నిమిత్తం కుటుంబసభ్యులు చాలా వరకు ఖర్చు చేశారు. ఈ క్రమంలో వారు వైద్య ఖర్చుల కోసం దీవెన ఫౌండేషన్‌ను ఆశ్రయించారు. దీంతో శనివారం దీవెన ఫౌండేషన్ విజయవాడ సిటీ పోలీస్ తరుపున గ్రూప్ సభ్యులు యాంటీ కరప్షన్ బ్యూరో హెడ్ కానిస్టేబుల్ ఆంజనేయులు, అజిత్‌సింగ్‌నగర్ ట్రాఫిక్ హెడ్ కానిస్టేబుల్ రాధాకృష్ణ హాస్పటల్‌కు వెళ్లి రూ.10 వేలు ఆర్థిక సహాయాన్ని అందచేశారు. విజయవాడ సిటీ పోలీసు పక్షాన స్థాపించిన దీవెన ఫౌండేషన్ సభ్యులు సహాయ, సహకారాలతో పేదలకు విద వైద్యం ఖర్చుల నిమిత్తం తమ వంతుగా ఆర్థిక సాయం అందచేస్తున్నామని, సహకరిస్తున్న గ్రూప్ సభ్యులందరికి ధన్యవాదాలు తెలియచేశారు.

వైఎస్సార్ సీపీకి అండగా నిలవాలి



మాట్లాడుతున్న అక్బర్

మధురానగర్(విజయవాడసెంట్రల్): ముస్లిం మైనార్టీల సంక్షేమం కోసం చిత్తశుద్ధితో పనిచేస్తున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి ముస్లిం మైనార్టీలు ఓటు వేసి అండగా నిలవాలని ప్రధాన మంత్రి 15 సూత్రాల కమిటీ జిల్లా సభ్యుడు ఎస్కే అక్బర్ శనివారం ఒక ప్రకటనలో కోరారు. ముస్లిం మైనార్టీలకు గౌరవం, సముచిత స్థానం కల్పించిన మహోన్నత వ్యక్తి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని పేర్కొన్నారు. అటువంటి జగనన్న ప్రభుత్వానికి ఓటు వేసి అండగా నిలవాలని ఆయన పిలుపునిచ్చారు. ఫ్యాను గుర్తుకు ఓటు వేసి మోసాల చంద్రబాబు, పవన్‌కళ్యాణ్, బీజేపీ కూటమికి తగిన బుద్ధి చెప్పాలని అన్నారు.

జగనన్నతోనే సుభిక్షమైన పాలన

- ప్రజలకు అందుబాటులో ఉండే నాయకున్నే ఎన్నుకోండి
- పశ్చిమ ఎమ్మెల్యే అభ్యర్థి ఆసిఫ్



ప్రచారంలో భాగంగా మాట్లాడుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి ఆసిఫ్, వేదికపై కేశినేని శ్వేత

వించిపేట(విజయవాడపశ్చిమ):పశ్చిమ నియోజవర్గం ప్రజలకు తాను ఒక తెరచిన పుస్తకం అని, వారి కుటుంబంలో ఒకడిగా ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని వైఎస్సార్ సీపీ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి షేక్ ఆసిఫ్ తెలిపారు. ఎంపీ కేశినేని కుమార్తె కేశినేని శ్వేతతో కలిసి వించిపేట నైజాంగేటు సెంటర్ నుంచి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పెద్ద సంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో శ్రీనివాసమహల్ సెంటర్, చిట్టినగర్, కబేళా, పాలఫ్యాక్టరీ, ఎర్రకట్ట, పంజా సెంటర్ భారీ ర్యాలీ నిర్వహించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో ప్రజలకు అందిన సంక్షేమ పథకాలు, అభివృద్ధిని వివరించారు. ప్రజలకు సుభిక్షమైన పాలన రావాలంటే తిరిగి జగనన్నను ముఖ్యమంత్రిని చేసుకోవాలని కోరారు. నియోజవర్గంలో ప్రతి డివిజన్‌పై తనకు పూర్తి అవగాహన ఉందని తెలిపారు. తనకు ఒక్క అవకాశం ఇస్తే నియోజవర్గాన్ని మరింత అభివృద్ధి పథంలో నడిపిస్తానని పేర్కొన్నారు. గత పదేళ్లుగా విజయవాడ అభివృద్ధికి ఎంపి కేశినేని నాని ఎంతో చేసి మచ్చలేని నేతగా నిలిచారన్నారు. కేవలం ఎన్నికల కోసం పశ్చిమ నియోజవర్గానికి వచ్చిన బీజేపీ అభ్యర్థి సుజన చౌదరి ఆంధ్ర విజయమాల్యాగా అభివర్ణించాడు. బ్యాంకుల్లో కోట్లాది రూపాయాలు రుణాలు తీసుకుని మోసం చేసిన వ్యక్తి ప్రజలను మోసం చేసేందుకు వచ్చాడని ధ్వజమెత్తారు. ప్రజలు అప్రమత్తంగా ఉండి సేవ చేసే నాయకుడినే ఎన్నుకోవాలని కోరారు. నియోజవర్గంలో ఏ గడపకు వెళ్లినా జగనన్న ప్రభుత్వంలో అందుతున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధితో సంతోషంగా ఉన్నామని తెలిపారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని అత్యధిక మెజార్టీతో గెలిపించుకుంటామని ముక్తకంఠంతో చెబుతున్నారని సంతోషం వ్యక్తం చేశారు. పేద, మధ్యతరగతి ప్రజలు ఎక్కువగా నివసించే పశ్చిమ నియోజవర్గంలో ఇప్పటికే అనేక అభివృద్ధి పనులు చేపట్టామని వెల్లడించారు. రానున్న రోజుల్లో మరింత అభివృద్ధి దిశగా ప్రణాళికలతో ముందుకు వెళ్తమన్నారు. కేశినేని శ్వేత మాట్లాడుతూ నీతి, నిజాయతీ, నిబద్ధతతో పనిచేసే నాయకున్నే ఎన్నికల్లో ఓటు వేసి గెలిపించుకోవాలని కోరారు. ప్రజలు ఎటువంటి ప్రలోభాలకు, మోసాలకు అవకాశం ఇవ్వకుండా నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషిచేసే నేత కేశినేని నాని, ఎమ్మెల్యే అభ్యర్థి ఆసిఫ్‌లకు తమ విలువైన ఓట్లు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పలు డివిజన్‌ల కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రాంగణ ఎంపికలో 18 మందికి ఉద్యోగాలు



పెనమలూరు: గంగూరు ధనేకుల ఇంజినీరింగ్ కాలేజీలో నిర్వహించిన ప్రాంగణ ఎంపికలో 18 మందికి ఉద్యోగాలు వచ్చాయని కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కడియాల రవి తెలిపారు. ఆయన శనివారం వివరాలు తెలుపుతూ బహుళజాతి సంస్థ జనరల్ ఎలక్ట్రిక్(జీఈ) ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, మెకానికల్ విభాగంలో 105 మంది విద్యార్థులకు ప్రాంగణ ఎంపికలు నిర్వహించారన్నారు. వీరిలో ఉత్తమ ప్రతిభ చాటిన 18 మంది విద్యార్థులకు ఉద్యోగాలు వచ్చాయని తెలిపారు. ఈ ఎంపికల్లో సంస్థ ప్రతినిధి జేపీ ప్రభు, కాలేజీ డైరెక్టర్ రవిప్రసాద్ పాల్గొన్నారు.

జగనన్నకు అండగా బ్రాహ్మణ సామాజిక వర్గం

- ఎన్నికల్లో విజయాన్ని అందిస్తాం
- ఏపీఐడీసీ చైర్‌పర్సన్ పుణ్యశీల



సమావేశంలో మాట్లాడుతున్న పుణ్యశీల

భవానీపురం(విజయవాడపశ్చిమ):ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాతే రాష్ట్రంలోని బ్రాహ్మణ సామాజికవర్గాన్ని ఆదరించి, గౌరవిస్తున్నారని ఏపీ ఐడీసీ చైర్‌పర్సన్ బండి నాగేంద్ర పుణ్యశీల అన్నారు. అటువంటి మంచి మనసున్న జగనన్న ప్రభుత్వానికి బ్రాహ్మణ సామాజికవర్గం యావత్తు రానున్న ఎన్నికల్లో విజయాన్ని అందిస్తుందని స్పష్టం చేశారు. విద్యాధరపురంలోని వైఎస్సార్ సీపీ పశ్చిమ ఎన్నికల ప్రధాన కార్యాలయంలో శనివారం బ్రాహ్మణ పెద్దలతో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. చంద్రబాబు పాలనలో బ్రాహ్మణుల అభ్యున్నతికి రూ.500 కోట్లు కేటాయిస్తామని ప్రకటించి కేవలం రూ.216 కోట్లు మాత్రమే విడుదల చేశారని గుర్తు చేశారు. సీఎం జగనన్న గడిచిన 59 నెలల్లో రూ.1000 కోట్లు ఇస్తానని చెప్పి వలంటీర్ల ద్వారా రూ.792 కోట్లు మేరకు వివిధ సంక్షేమ పథకాలను ఇంటి వద్దే అందించారని చెప్పారు. వంశపారంపర్య అర్చకత్వ విధానాన్ని చంద్రబాబు తీసేస్తే సీఎం జగనన్న దానిని పునఃరుద్ధరించి వారిని ఆదుకున్నారని పేర్కొన్నారు. టీటీడీ పరిధిలోని పురోహితులకు 150 గజాల స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేసి మరీ ఇవ్వడం, దేవాలయాల్లోని అర్చకులకు రిటైర్మెంట్ లేకుండా జీవితాంతం దైవ సేవ చేసుకునే అవకాశం కల్పించిన ఘనత సీఎం జగనన్నదేనన్నారు. కృష్ణా పుష్కరాల పేరుతో చంద్రబాబు విజయవాడలో 40 గుళ్లు, గోశాల కూల్చేస్తే దేవదాయ శాఖ మంత్రిగా పనిచేసిన వెలంపల్లి శ్రీనివాసరావు వాటన్నింటిని పునర్నిర్మించారని చెప్పారు. పశ్చిమ ఎమ్మెల్యే అభ్యర్థి షేక్ ఆసిఫ్‌ను అత్యధిక మెజార్టీతో గెలిచేలా కృషి చేస్తామని తెలిపారు.

జగనన్న సంక్షేమ ప్రభుత్వాన్ని కొనసాగించుకునేందుకు బ్రాహ్మణ సామాజికవర్గం అంతా సిద్ధంగా ఉండాలని కార్పొరేటర్ శర్వాణి మూర్తి, మాజీ కార్పొరేటర్ గండూరి మహేష్ పిలుపునిచ్చారు. కోవిడ్ కష్టకాలంలో బ్రాహ్మణ కో ఆపరేటివ్ సొసైటీ ద్వారా చిన్నచిన్న వ్యాపారాలు చేసుకునేందుకు దాదాపు రూ.200 కోట్లు రుణాలు ఇచ్చి ఆదుకున్నారని గుర్తు చేశారు. అలాగే బ్రాహ్మణ కార్పొరేషన్ ద్వారా చేయూత పథకం ద్వారా ఒకొక్కరికి రూ.15వేలు చొప్పున 45వేల మంది బ్రాహ్మణ ఆడపడుచులకు రూ.75వేలు ఇచ్చిన ఘనత సీఎం జగనన్నదన్నారు. బ్రాహ్మణ సామాజికవర్గం ఐక్య వేదిక కన్వీనర్ జింకా చక్రధర్ మాట్లాడుతూ నగరంలో బ్రాహ్మణ భవన్ నిర్మాణం ఆవశ్యకతపై వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డిని ఇటీవల కలిసి వివరించానని పేర్కొన్నారు. అందుకు ఆయన సానుకూలంగా స్పందించడం హర్షణీయమన్నారు. పశ్చిమ ఎమ్మెల్యే అభ్యర్థి షేక్ ఆసిఫ్ గెలుపుకు తమ వంతు కృషి చేస్తామని చెప్పారు. సమావేశంలో హరనాథ్, సుబ్రహ్మణ్య శర్మ తదితరులు పాల్గొన్నారు.

వేసవిలో గోవులపై ప్రత్యేక పర్యవేక్షణ



దూడలను పరిశీలిస్తున్న ఈవో రామరావు



మజ్జిగ పంపిణీని పరిశీలిస్తున్న ఈవో

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ):పెరుగుతున్న ఎండలు, వడగాల్పుల నేపథ్యంలో ఆలయ ప్రాంగణంలో ఉన్న గోవులు, దూడలకు ప్రత్యేక రక్షణ చర్యలు తీసుకోవడంతో పాటు వాటి పర్యరక్షణకు చర్యలు తీసుకోవాలని దుర్గగుడి ఈవో కేఎస్ రామరావు తెలిపారు. దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గోశాలను ఈవో రామరావు శనివారం పరిశీలించారు.

అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని లక్ష్మీ గణపతి విగ్రహం ఆవరణలో ఉన్న రెండు గోశాలను పరిశీలించడంతో పాటు అందులో ఉన్న దూడల పరిశీలించారు. గోవులకు ఎటువంటి ఇబ్బంది కలుగకుండా గోశాలలో ఫ్యాన్‌తో పాటు కూలర్‌ను అందుబాటులో ఉంచినట్లు ఆలయ అధికారులు పేర్కొన్నారు. అదే విధంగా ఎండ తీవ్రత అధికంగా ఉన్న తరుణంలో వాటికి వడదెబ్బ తగలకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలోని చలివేంద్రంలో భక్తులకు పంపిణీ చేస్తున్న మజ్జిగ వితరణను పర్యవేక్షించారు.

రెట్టించిన ఉత్సాహంతో వైఎస్సార్ సీపీ



ప్రచారంలో ముఠా కూలీలతో మాట్లాడుతున్న ఆసిఫ్ (ఫైల్)



వృద్ధురాలితో మాట్లాడుతున్న కేశినేని శ్వేత (ఫైల్)



సంక్షేమ పథకాల కరపత్రాలు అందిస్తున్న ఆసిఫ్ కుమార్తె, కుమారుడు (ఫైల్)

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పశ్చిమ నియోజకవర్గంలో ప్రచార పర్వానికి తెరపడింది. గడువు ముగియటంతో శనివారం సాయంత్రానికి మైకులన్నీ మూగబోయాయి. నియోజకవర్గంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీతో పాటుగా టీడీపీ కూటమి నుంచి బీజేపీ అభ్యర్థిగా సుజనాచౌదరి, ఇండియా కూటమి నుంచి సీపీఐ అభ్యర్థి జి.కోటేశ్వరరావుతో పాటుగా మరో 12 మంది వివిధ పార్టీలు, స్వతంత్ర అభ్యర్థులు పశ్చిమ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్నారు. లోక్‌సభ అభ్యర్థిగా వైఎస్సార్ సీపీ నుంచి ప్రస్తుత ఎంపీ కేశినేని నాని, టీడీపీ నుంచి కేశినేని చిన్ని పోటీ పడుతున్నారు. వీరంతా శనివారం సాయంత్రం తమ ఎన్నికల ప్రచారానికి ముగింపు పలికారు. పశ్చిమ నియోజకవర్గంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రెట్టించిన ఉత్సాహంతో ప్రచార పర్వంలో దూసుకుపోయింది. జనవరి రెండో తేదీన ఆ పార్టీకి చెందిన షేక్ ఆసిఫ్‌ను పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జిగా పార్టీ అధిష్టానం ప్రకటించింది. అనంతరం మార్చి మాసంలో నియోజకవర్గ అభ్యర్థిగా అధికారికంగా ప్రకటించింది. ఆసిఫ్ జనవరి రెండో వారం నుంచే ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టారు. సుమారు నాలుగున్నర మాసాలు పూర్తిగా ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించిన ఆయన రెండు మూడుసార్లుకు పైగా నియోజకవర్గాన్ని చుట్టేశారు. దాదాపుగా ప్రతి గడపకు వెళ్లి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిగా చేయటానికి ప్రజలు అండగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. సామాన్యుడునైన తనను అసెంబ్లీకి పంపించాలని అభ్యర్థించారు. శనివారం సాయంత్రం పశ్చిమంలో ఆఖరి ప్రచార పర్వంగా భారీ ర్యాలీ నిర్వహించి మొత్తం చుట్టేశారు. ఆసిఫ్ పక్షాన ఆయన కుమార్తె రేష్మా, కుమారుడు జావిద్, అల్లుడు అప్సర్‌లు ప్రచారంలో పాల్గొన్నారు. ఆసిఫ్‌ను గెలిపించాలని గడపగడపకు వెళ్లి ప్రచారాన్ని ముందుకు తీసుకెళ్లారు. అలాగే ఎంపీ అభ్యర్థి కేశినేని నాని తరుపున ఆయన కుమార్తె కేశినేని శ్వేత సైతం నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటించారు. నియోజకవర్గంలోని అన్ని డివిజన్లలోనూ ఆమె పర్యటించి తన తండ్రిని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే ప్రతిపక్ష పార్టీల నేతలకు సైతం మద్దతుగా వారి కుటుంబ సభ్యులు ప్రచారం చేశారు.

బ్యాంక్ దొంగలను తరిమికొట్టండి

బీబీఏ మాజీ అధ్యక్షుడు మన్మధరావు



సమావేశంలో మాట్లాడుతున్న మన్మధరావు

భవానీపురం(విజయవాడపశ్చిమ):దేశ చరిత్రలో 'మంచి చేసి ఉంటే ఓటెయ్యమని' ధైర్యంగా అడగ కలిగిన ఒకే ఒక్కడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని బెజవాడ బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు, సీనియర్ న్యాయవాది చోడిశెట్టి మన్మధరావు తెలిపారు. విద్యాధరపురంలోని వైఎస్సార్ సీపీ పశ్చిమ ఎన్నికల ప్రధాన కార్యాలయంలో శనివారం న్యాయవాదులు ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. తన సర్వీస్‌లో అనేక రాజకీయ పార్టీలు, ఎన్నికలను చూశానని చెప్పారు. పార్టీలు, కుటుంబాలు, కులాలు, మతాల మధ్య చిచ్చు పెడుతున్న టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థులను మాత్రం చూడలేదని తెలిపారు. ప్రజలకు ఏం చెప్పాలో తెలియని కూటమి జగన్ ప్రభుత్వం ఇప్పుడు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను రెట్టింపు చేస్తాం.. వలంటీర్ వ్యవస్థను కొనసాగిస్తాం అంటూ అబద్ధపు హామీలను ప్రకటిస్తుందన్నారు. అభివృద్ధి అంటే పెద్ద పెద్ద భవనాలు కట్టటం, ఫ్లై ఓవర్లు నిర్మించటమేనా అని ప్రశ్నించారు. తినడానికి తిండి లేక అల్లాడుతున్న వారికి తాము అధికారంలోకి వస్తే మహానగరాలు నిర్మిస్తామని చెప్పటం తప్ప వారి ఆకలి తీరేందుకు తామేం చేస్తామో చెప్పకపోవడం హాస్యాస్పదంగా ఉందన్నారు. కృష్ణానది ఉపరితలం కన్నా తక్కువ ఎత్తులో ఉన్న అమరావతి ఎంచుకున్న చంద్రబాబు కేవలం ఆ పార్టీ, తమ సామాజికవర్గం ఆక్రమించుకునేందుకేనని తెలిపారు. రేపు జరగబోయే సార్వత్రిక ఎన్నికలు పేదలు – పెత్తందార్లు, ధర్మం – అధర్మం మధ్య జరగటం ఒక ప్రత్యేకతను సంతరించుకున్నాయని పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలంతా ఒక వైపు ధనికులంతా ఒక వైపు మొహరించిన ఈ ఎన్నికల సంగ్రామంలో మంచి చేసేవారు, నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండేవారిని ఎన్నుకోవాలని కోరారు. ఎక్కడి నుంచో ఇక్కడికి వచ్చిన సుజనా చౌదరి వంటి వలస పక్షులను, బ్యాంక్‌లను దోచుకున్న దొంగలను తరిమి తరిమి కొట్టాలని పిలుపునిచ్చారు.

ఈ సమావేశంలో న్యాయవాదులు నరహరిశెట్టి శ్రీహరి, అబ్రహం లింకన్, శ్రీనివాస చక్రవర్తి, సత్యా రెడ్డి, బూసి సతీష్, గఫార్, సుధాకర్, వివేకానందమూర్తి, నరహరిశెట్టి జ్యోతి, జంగం జయలక్ష్మి, ఉషా జ్యోతి, సౌమ్య తదితరులు పాల్గొన్నారు.









రద్దీగా పండిట్ నెహ్రూ బస్ స్టేషన్

ఎన్నికల నేపథ్యంలో సొంతూళ్లకు వెళ్తున్న ప్రయాణికులతో విజయవాడలోని పండిట్ నెహ్రూ బస్‌స్టేషన్ రద్దీగా మారింది. నగరంలో నివాసం ఉంటున్న వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు తమ ఓటు హక్కు వినియోగించుకునేందుకు స్వగ్రామాలకు పయనమయ్యారు. భారీగా తరలివచ్చిన ప్రయాణికులతో బస్ స్టేషన్ కిటకిటలాడింది. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలకు విజయవాడ నుంచి బస్సులు ఏర్పాటుచేశారు.

–సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

వైఎస్సార్ సీపీకి అండగా ముస్లిం మైనార్టీలు

ముస్లిం యునైటెడ్ ఫ్రంట్



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులందరికీ ముస్లిం మైనార్టీ సమాజం సార్వత్రిక ఎన్నికల్లో అండగా ఉండాలని ముస్లిం యునైటెడ్ ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షుడు హబీబుర్ రెహామ్స్ పిలుపునిచ్చారు. వివిధ ముస్లిం మైనార్టీ సంఘాలతో కలిసి ఆ సంస్థ కార్యాలయంలో శనివారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా సార్వత్రిక ఎన్నికల్లో మైనార్టీలను కొన్ని పార్టీలు చీల్చేందుకు కుట్రలు చేస్తున్నాయని తెలిపారు. చంద్రబాబు మూడు పర్యాయాలు రాష్ట్రాన్ని పరిపాలించారన్నారు. ఎన్నో హామీలిచ్చిన ఒక్కదానినీ నిలబెట్టుకోలేదని చెప్పారు. అలాగే టీడీపీ పాలనలో ముస్లింలపైనా, మదరాసలపైనా దాడులు చేశారని గుర్తు చేశారు. ప్రతి సారీ ముస్లింలు టీడీపీతో మోసపోయారని చెప్పారు. హామీలివ్వటం, విస్మరించడం చంద్రబాబుకు అలవాటేనన్నారు. ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసే వ్యక్తి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మాత్రమేనన్నారు. విజయవాడ నగరాన్ని పూర్తిగా అభివృద్ధి చేశారన్నారు. దేశంలోనే అతి పెద్ద రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేశారన్నారు. ఆ స్ఫూర్తితో అనేక అద్భుతమైన కార్యక్రమాలు అమలు చేస్తున్నారని వివరించారు. పశ్చిమ నియోజకవర్గం నుంచి వైఎస్సార్ సీపీ పక్షాన అతి సామాన్యుడైన మైనార్టీ వ్యక్తి షేక్ ఆసిఫ్ పోటీ చేస్తున్నారన్నారు. మరోపక్క అపర కుబేరుడు నగరానికి సంబంధం లేని వ్యక్తి బీజేపీ అభ్యర్థి సుజనా చౌదరి పోటీ చేస్తున్నారని చెప్పారు. యావత్ ముస్లిం సమాజం ఆసిఫ్ విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఆసిఫ్‌ను పశ్చిమం నుంచి కేశినేని నానిని పార్లమెంట్ స్థానానికి అఖండ మెజారిటీతో గెలిపించాలని కోరారు.

అలరించిన వీణ వాద్య కచేరీ



విజయవాడకల్చరల్: శ్రీ సుబ్రహ్మణ్య మహతి సంగీత సమితి ఆధ్వర్యంలో సంగీత మూర్తి త్రయంలో ఒకరైన శ్యామశాస్త్రి, త్యాగరాజ స్వామివారి జయంతి సందర్భంగా సత్యనారాయణపురంలోని సంస్థ కార్యాలయంలో శనివారం సంగీత సమితి నిర్వహించిన శాస్త్రీయ సంగీత కచేరీ సంగీత వైభవాన్ని చాటింది. సంగీత సమితి విద్యార్థినులు త్యాగరాజస్వామి, ముత్తుస్వామి దీక్షితార్ రచించిన కీర్తనలను వీణపై పలికించారు. సంగీత సమితి ప్రధాన కార్యదర్శి సీవీ రావ్ మాట్లాడుతూ కర్నాటక సంగీతంలో ముత్తుస్వామి దీక్షితార్, శ్యామశాస్త్రి, త్యాగరాజస్వామిలను మూర్తిత్రయం అంటారని తెలిపారు. సంగీతానికి ఎల్లలు లేవని శాస్త్రీయ సంగీతాన్ని పరిరక్షించుకోవాల్సిన అవసముందన్నారు. బాల బాలికలను ప్రోత్సహించడానికి జాతీయ స్థాయిలో సంగీత పోటీలను ప్రతీ ఏటా నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

వజ్రకుమారి సేవలు ప్రశంసనీయం

గన్నవరం రూరల్: మండలంలోని చిన అవుటపల్లి డాక్టర్ పిన్నమనేని సిద్ధార్థ ఆస్పత్రిలో శనివారం అంతర్జాతీయ నర్సింగ్ డే నిర్వహించారు. కళాశాల డైరెక్టర్ జనరల్ డాక్టర్ చదలవాడ నాగేశ్వరరావు సీనియర్ నర్సు పి.వజ్రకుమారిని సత్కరించి ఆమె సేవలని కొనియాడుతూ యాజమాన్య అవార్డును అందజేశారు. ప్రిన్సిపాల్ డాక్టర్ భీమేశ్వర్, సూపరింటెండెంట్ కె.ప్రసన్నవాణి తదితరులున్నారు.

నేడు దుర్గమ్మ సన్నిధిలో ఆదిశంకరాచార్యుల జయంతి

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం ఇంద్రకీలాద్రిపై ఆదివారం ఆదిశంకరాచార్యుల జయంతి వేడుకలను నిర్వహించనున్నారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని రావిచెట్టు వద్ద ఉదయం 8–30 గంటలకు ఆదిశంకరాచార్యుల విగ్రహానికి పంచామృత అభిషేకాలు, అర్చన నిర్వహిస్తారు. సాయంత్రం ఆది శంకరాచార్యుల విగ్రహంతో నగరోత్సవ సేవ జరుగుతుందని ఆలయ వైదిక కమిటీ పేర్కొంది.